# గొరిల్లు

ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి తమ తమ పార్టీ గుర్తులతో ముమ్మరంగా ప్రచారాన్ని చేసుకుంటున్నారు. ఆ నియోజక వర్గంలో ముఖ్యంగా పోటి యిద్దరి మధ్యన వుంది. ఒకరు రెడ్డి, ఇంకొకరు చౌదరి. ఇరువురు రాజకీయాలలో అరితేరినవారే. ఒకరిని ఓడించాలని మరొకరు.

వీధుల్లో ఊరేగింపులు, వాడల్లో బుర్రకథలు. ఎన్నికల కార్యాలయాలలో ప్రచార రచనలు పుంజుకున్నవి.

పార్టీ జండాలతో, ఎన్నికల గుర్తులతో కార్లు, జీపులు ముఖ్య వీధులగుండా తిరుగుతున్నవి. ఒక పార్టీ జీపు మరో పార్టీ జీపుకు సైడ్ ఇచ్చుకోవడం మానేశారు. ఎపుడైన ఒక పార్టీ జీపు మరో పార్టీ జీపు ఎదురొస్తే విడిపోవడానికి ఎంతో టైమ్ పడుతోంది. నిన్న మొన్నటి వరకు కలిసి తిరిగిన కార్యకర్తలు యిపుడు కళ్లెర్ర చేసుకొని కత్తులు దూసుకుంటున్నారు.

ఎంకులు రెడ్డి మనిషి, ఆజానుబాహుడు, బుద్ధి బలంకంటె భుజబలం ఎక్కువఅని అతనికివున్న వళ్లు, అతను పెంచిన మీసాలే చెబుతున్నాయి. ఎపుడు పదిమంది అతని వెంట ఉంటారు. అతనే మోరెడ్డిగారి వెంట ఉంటాడు. అందుకని రెడ్డిగారి ఎన్నికల భారాన్ని తన భుజాలమీద వేసుకున్నాడు.

రంగయ్య చౌదరి మనిషి. బక్కపలుచని మనిషేగాని భలే తెలివైనవాడు. అందరు చౌదరిని నమ్మితే చౌదరి ఒక్క రంగయ్యను మాత్రమే నమ్ముతాడు. కార్యకర్తలతో ఎలా పని తీసుకోవాలో, ఏ గండాన్ని ఎలా గట్టెక్కించాలో అతనికి బాగా తెలుసు.

రెండు వైపుల నుండి యిద్దరు తమ తమ నాయకుల గెలుపుకోసం కృషి చేస్తున్నారు.

ప్రచారపు పద్ధతులు ఆకర్షణీయంగా, ప్రచారపు పాటలు ఆధునికంగా, ఒకరిని మించి మరొకరివి.

పట్టణమంతా అలజడిగా వుంది. సారా డిపోలోని సారా తరిగి నీళ్ల శాతం పెరుగుతోంది. బ్రాంది షాపులలో పాతసరుకంత అయిపోగా

కొత్త సరుకు ధర పెంచుతున్నారు. బార్ల యజమానులు గుమస్తాలకు కౌంటర్స్ అప్పగించి తాము కనపడకుండా తిరుగుతున్నారు. ఉంటె ఉద్దెర యివ్వాలి, కనబడితే కనీసం ఎన్నికల చందా అయినా యివ్వాలి. అందుకే వాళ్లు తప్పుకొని రాబోవు నష్టాన్ని తప్పించుకొంటున్నారు. హోటల్స్ పరిస్థితి అంతేవుంది. రుచి తగ్గింది, శుచి తగ్గింది. అయినా ధరలు మాత్రం పెరుగుతూనే వున్నవి.

ఊర్లన్ని తిరిగొచ్చిన రెడ్డి తన కార్యకర్తలతో యిన్ని రోజులు చేసిన ప్రచార కార్యక్రమాల్ని రివ్యూ చేస్తూ కూర్చున్నాడు.

"నా ఏరియా సాలిడ్ సార్!" ఎస్. ఎస్. సి. వరకు చదివి, వ్యవసాయాన్ని పార్టు టైమ్‌గా, రాజకీయాలను ఫుల్ టైమ్‌గా వెలగబెడుతున్న ఓ యువకుడు

"నా బెల్లుగూడ అంతే సార్ !" ఇంతకుముందు కమూనిష్టు ఇపుడు కాంగ్రెసుగా మారిన మరో వ్యక్తి

"మా గ్రామానికి మాత్రం మరోసారి తమరు రావాలి సార్" క్రితంలో మాలి పటేల్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న వ్యక్తి.

"మా పల్లెకు ఆ కరెంటు కాస్త యిప్పిస్తె - ఒక్క ఓటు పొల్లు పోదనుకొండి" మరొక కార్యకర్త. అందరు అయన్ని పై రవీకార్ అంటారు.

రెడ్డి అందరి మాటలు వింటున్నాడు.

"చౌదరి మనుషులతో మనకు పెద్ద తగదా వచ్చింది" అన్నాడు ఒక వ్యక్తి. అయన అంతకు ముందు జరిగిన మున్సిపల్ ఎన్నికలో

చౌదరి మనిషి. ఈ ఎన్నికల్లో రెడ్డి వైపొచ్చాడు. చౌదరి మంచి నాయకుడే కాని అయన చుట్టు అంతా వినాయకులే అని అప్పుడప్పుడు అంటూ రెడ్డి కార్యకర్తలకు దగ్గర అవుతున్నాడు. చౌదరిని, చౌదరి మనుషులను ఎదురుకొనడానికి నీవే గదటయా బాబూ తగిన వాడివి. నీవంటే వాళ్ళకు హడల్'' నవ్వుతూ అన్నాడు రెడ్డి.

''అది నిజమే అనుకొండి, వాడి కీలు కీలు నాకు తెలుసు–''

''అందుకే వాత పెట్ట మంటున్నా - ఇదే అదను -'' కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడు అర్జునుని చూచిన చూపు. అదెంత పని అన్న చూపు కార్యకర్తది.

''కొయ్యర కొయ్యి'' అన్నారెవరొ చిన్నగ గుంపులో

''జరిగే వన్ని జరుగుతూనే వుంటాయి. మనకు సమయం ఎక్కువ లేదు. చివరి రెండ్రోజులలో మనం జనాన్ని ఒక తాటిపై వుంచాలి''

''సార్ చీటీలు పంచేటప్పుడు మిగతావాటిని గూడ ఊరూర పంచాలి.'' ముఖ్య సలహాదారు సలహ.

''అందుకు అన్ని ఏర్పాట్లు చేశాను'' రెడ్డి.

"వాళ్ళది అధికార పార్టీ కాబట్టి డబ్బు బాగా వెదజల్లుతుండ్రు–'' ఓ కార్యకర్త. అందరు అయన్ను ఓట్ల కమీషన్ వ్యాపారి అంటారు.

''చూడు నాయనా అధికారం ఒక్కరి అబ్బసొత్తుకాదు. ఈ రోజు వాడిదైతే రేపు మనది.'' రెడ్డి ఈ మాటలనగానే అందరు ఏదో కొత్త ఉత్సాహాన్ని నింపుకున్నారు.

రెడ్డి కళ్లు ఒక సారి మూసి మళ్ళీ తెరుచుకున్నాయి. ఆయన చెస్ట్ భాగం కాస్త పెరిగి యధాస్థానంలోకి వచ్చింది. బహుశ ఆయన గెలచి ఊరేగింపుల్లో పాల్గొన్నట్లు ఫీల్ అయినట్టు వుంది.

ఆ తరువాత కొంత నిశ్శబ్దం. బ్రాంది సీసాలు వూరిపేరు, నోట్ల కట్టలు చోటా నాయకుల పేర, పోల్ చిట్టీలు కార్యకర్తల పేర, వాల్ పోస్టర్స్ పేడ్ కార్యకర్తల పేర పంచబడ్డవి. ఎవ్వరు ఏది తీసుకోవాలో అవి తీసుకున్నారు.

కులాల వారిగా మతాలవారిగా వున్న ప్రతి వీధి వీధిని తాను తన కార్యకర్తలతో తిరుగుతున్నాడు చౌదరి. తాను ప్రజలకు చేసిన మేలును, తన పార్టీ దేశానికి చేసిన సేవలను, మరి గుర్తు చేస్తూ చేతులు జోడించి నడుస్తున్నాడు. చౌదరి గారి బొమ్మ, పార్టీ నినాదాలున్న డోర్ పోస్టర్స్ ప్రతి తలుపుకు అతికిస్తున్నారు కార్యకర్తలు. బడిపిల్లలు, వీధులలో ఆడుకునే చిన్నపిల్లలు బ్యాడ్జీలు ఇవ్వాలన్న ఉద్దేశంతో గుంపులు గుంపులుగా చేరి చౌదరి గారికి సంతోషం, కార్యకర్తలకు ఉత్సాహం కలిగించే నినాదాలు చేస్తున్నారు. వాళ్ళ చేతుల్లోకి కూడ బ్యాడ్జీలు చేరుతున్నవి.

వీధుల్లో బారులుగా నిల్చున్న జనం చౌదరిగారికి ప్రతి నమస్కారం చెపుతూ "తప్పకుండా మా ఓటు మీకే" అంటున్నారు.

"చౌదరిగారిక్కి" ఓ కార్యకర్త.
"జై" జనం

చౌదరిగారు ముసి ముసిగా నవ్వుతూ నడుస్తూవుంటే ఒక్కొక్క వ్యక్తి ఆయన్ని సమీపించి కరచాలనం చేస్తూ, గెలుపు ఖాయం అంటూ

హామీ యిస్తున్నారు. అలా అన్నవారిని చౌదరిగారు కౌగిలించుకొని అప్యాయతగా నిమురుతున్నాడు.

జనం మీద నాయకునికి వున్న ప్రేమ. నాయకుని మీద జనానికి వున్న నమ్మకం, భక్తి, అర్థం కాని బడిపిల్లలు కేకలు వేస్తు గంతు లేస్తున్నారు.

ఆ వీధి దాటిన తరువాత వచ్చిన మరో వీథిలో, విశాలమైన ప్రహారి గోడలున్న ఓ యింట్లో, ఓ చిన్న మీటింగు ఏర్పాటైంది.

వీధిలోని ముఖ్యులు చౌదిరిగార్కి పూలమాలలు వేయగా మరి కొందరు ఆడవాళ్ళు హారతిపట్టి, నుదుట కుంకుమ దిద్దారు. కార్యకర్తలు గూడ నుదుట కుంకుమ ధరించి చౌదరిగార్ని పైకి లేపి తమ తమ మద్ద తును ప్రకటించారు. ఆ తరువాత ఎదురుగా వున్న యింట్లో జరుగుచున్న కార్యకర్తల మీటింగుకు ముఖ్యులు మాత్రమే వెళ్ళారు. చౌదరిగారి ఉపన్యాసం ముగిశాక, ఆ వీధి పెద్దలు మాట్లాడుతూ రెడ్డిగారు చేయించే దౌర్జన్యాన్ని, ఆయన కార్యకర్తలు చేసే గుండాయిజాన్ని గుర్తుకు తెచ్చారు.

''మనం మగాళ్ళమేగా'' చౌదరి

''అవును మనకు గాజుల్లేవు'' ఓ యువ కార్యకర్త.

''దెబ్బకు దెబ్బ-'' మరికొన్ని గొంతులు.

రాజకీయ రహస్యాలు మాట్లాడక రెండు నిండు సారా జాడీలు ప్రక్క గదిలోకి రాగా, చౌదరిగారు మరో మీటింగ్‌లో పాల్గొనడానికి వెళ్లారు.

అందరు చౌదరిగారి గూర్చే మాట్లాడుకుంటున్నారు. అక్కడే వున్న ఒక విద్యార్థికి ఇదంతా అర్థంకాలేదు. నిన్న జరిగిన ఇలాంటి మీటింగ్‌లో రెడ్డిగార్ని గూర్చి ఇలాగే మాట్లాడారు. మొన్న జరిగిన ఇండిపెండెంట్ అభ్యర్థిని తప్పక గెలిపిస్తామన్నది వీళ్లే - అందరికి దండ లేసి, అందరికీ జై కొట్టి, అందరిదగ్గర పుచ్చుకొని, తమకున్న ఒక్క ఓటు ఎవరికిచ్చుకుంటారో. అనుకుంటూ తాను వెళ్లిపోయాడు.

పాతికేండ్ల క్రితము నేను పోటిచేసినప్పుడు ఇన్ని గందరగోళాలు లేవు అంటు వాపోతున్నాడు ఓ మాజీ యం. యల్. ఏ.

• •

రేపటినుండి అన్నిరకాల ప్రచార విధానాలను నిలుపుదల చేయ వలసిందిగా అజ్ఞలు జారీ అయినందున ఈ రోజు ప్రచారము మమ్మరంగా వుంది. బుర్రకథలు, బతకమ్మపాటలు, గోళ్లకథలపార్టి; వాళ్లను మోస్తున్న జీపులు పట్టణమంతా తిరుగుతున్నాయి.

అన్ని పార్టీలవారు తమ తమ అభ్యర్థులతో ఊరేగింపు నడుపు తున్నారు. వెనక ముందు పోలీసు వ్యానుల మధ్యన పార్టి ఊరేగింపు.

ఓ రోడ్డు మలుపులో రెడ్డిగారి ఊరేగింపు జీపుకు చౌదరిగారి జీపు ఎదురైంది. ఇక అంతే. జీపులు ఎదురు ఎదురుగా ఆగినవి. నినాదాలు మారు మ్రోగుతున్నవి. అందరు గొంతు చించుకుంటున్నారు. జీపులు కదలడంలేదు. జీపులను కదలించే ప్రయత్నము చేయబోగా కార్యకర్తలు కదలనివ్వడం లేదు. ఎదుటివాడే రివర్సు వెళ్లాలి, మనం కాదు అంటున్నారు.

నినాదాలు పోయి కేకలుగా మారినవి.

''రెడ్డి'' ఓ గొంతు

''డౌన్ డౌన్'' మరికొన్ని గొంతులు
''చౌదరి'' ఎదుటివారిలో ఓ గొంతు
''డౌన్ డౌన్'' ఎన్నో గొంతులు

కేకలు పోయి తిట్లుగా మారినవి. అంతటితో ఆగక చేతులు కలసినవి. చొక్కాలు చినిగినవి.

పోలీసువాళ్లు నిలుచోని చూస్తున్నారు.

గొడవ ముదిరింది. జండా కర్రలు విరుగుతున్నవి. సైకిలు చైన్స్ గిరగిరా తిరుగుతున్నవి. సోడాబుడ్లు పగులుతున్నవి.

అప్పటివరకు నిలుచోని చూస్తున్న పోలీసు వాళ్లు హారన్ మోతతో అప్పుడే వచ్చి ఆగిన జీప్ దిగుతు చేసిన ఎస్. పి. గారి సైగను గ్రహించి, గాలిలోకి తుపాకుల్ని పేలిచారు. జనం చెదిరిపోయారు.

అక్కడి నేలంతా రక్తపు మరకలతో తడిసింది.
తల పగిలి ఒకరు-
చేతులు విరిగి ఇంకొకరు-
స్పృహ తప్పి ఓ యిద్దరు -
ఎన్నాళ్ళ పగలో, ఎన్నేళ్ళ ఈర్ష్యలో అక్కడ నెత్తురు చిమ్మినవి.
కసి తీర్చుకున్నవి.

◆ ◆ ◆

గెలచిన అభ్యర్థిని ఊరేగించడం కోసం అలంకరించిన జీప్ సిద్ధంగావుంది కౌంటింగ్ హాల్ ముందు, దాని చుట్టూర జనం మూగారు.

నుదుట పట్టిన చెమటను భుజంపైవున్న కండువాతో తుడుచ్చుకుంటు '' గ్రామాల్లోని ఓటర్సు పర్వాలేదు, టౌన్ ఓటర్స్ ముంచారు ''

అంటూ కౌంటింగ్ హాలు ఎదురుగా నిల్చున్న చౌదరిని చేరాడు రెడ్డిగారు. అతని రాకను గమనించిన చౌదరి జేబులో నుండి సిగరెట్ ప్యాకట్‌ను తీసి రెడ్డికోటిచ్చి తాను వెలిగించాడు.

సిగరెట్ దమ్ములాగి వదలి, చౌదరి బుజం మీద చేయివేసి కాస్త ప్రక్కకు నడిచి -

'' ఈ నాయుడి సంగతి తెలుసా మీకు? ఈయనగారు చిన్నప్పుడు ఇంటింటా న్యూస్‌పేపర్ వేసేవాడట. అందుకని ప్రతివాడికి తెల్సు - పెద్దయ్యాక కొన్నాళ్ళు పూలు అమ్మేవాడట. అందుకని స్త్రీ ఓటర్స్ కూడ తెల్సు. ''

'' అదేమి అతని గెలుపుకు కారణం కాదు రెడ్డి - అసలు ఓటర్స్ సరియైన తీర్పు యివ్వలేదు ఈసారి ''

'' అయినా ఈ సన్నాసిగాళ్ళకు రాజకీయాలు తెలిస్తేగదా, పట్టి గొర్రెలమంద ఎటుమొగ్గితే అటే''

గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి నాయుడుగారు వచ్చి అలంకరించిన టాప్‌లేని జీపులో నిలుచున్నారు. అభిమానులు పూలమాలలు వేసి జై జై నినాదం చేసి, జీప్ కో టెంకాయ కొట్టారు. జీపు కదిలింది. జనం కదిలారు.

రెడ్డి, చౌదరి చూస్తూ నిలుచున్నారు.

నా మనస్సు మాత్రం హాస్పటల్లో పడివున్న కార్యకర్తల గూర్చి ఆలోచిస్తుంది. వాళ్లు మాత్రం నిజంగా గొర్రె పొట్టేళ్ళే.